



# Voice of Jagadguru



advaitam paramanandam

an e-magazine on advaita


## Jagadguru Vani అనుగ్రహ భాషణం నిజమైన బంధువు



మన జీవితంలోని కొంత మందిని అనగా మన స్నేహితులను, బంధువులను, మనకు సంబంధించినవారని, ఆత్మీయులు అని మనం అనుకుంటాం. ఈ ఆప్తులు, మన కష్ట కాలంలో మనకు సహాయము కూడా చేస్తారు. మనం కూడా ఒక్కోసారి మన దుఃఖానికి కారణమైన వారిని నిందిస్తాము అలాగే సంతోషానికి కారణమైన వారిని ప్రశంసిస్తాము. కానీ మన శాస్త్రాలు ఏమని చెబుతున్నాయి అంటే,

ఆత్మైవ హయాత్మనో బంధుః |ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ |
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవరిపురాత్మనః ||

"ఒక వ్యక్తి యొక్క నిజమైన స్నేహితుడు ఎవడంటే, తాను తప్ప మరెవరో కాదు. మీ సర్వావస్థలయందు, మీతో పాటు అండగా నిలబడే వ్యక్తిని "బంధు" అని పిలుస్తారు. ఆ బంధువు మరెవరో కాదు మీరు చేసిన కర్మయే”. ఇది మన జీవిత కాలమంతా మనతో బాటు వుండటమే కాకుండా, మన మరణం తర్వాత కూడా, రాబోయే జన్మలలో కూడా మనతో బాటు ఉంటుంది.

మన కర్మలే మన సుఖ-దుఃఖాలకు కారణం. మనం ధర్మాన్ని ఆచరిస్తే, సుఖాన్నీ పొందుతాము మరియు ఈ జన్మలోనే కాకుండా, రాబోయే జన్మలలో కూడా ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతాము. అదే సమయంలో మనం అధర్మం చేస్తే, దుఃఖాన్నీ పొందుతాము. సత్యం ఏమిటంటే, మన సుఖ-దుఃఖాలకు ఇతరులను నిందించడం తెలివైన పని కాదు. ఒక వ్యక్తి తన జీవితంలో జరిగే అన్ని సంఘటనలకు తానే బాధ్యుడు, ఇతరులు కాదు అని చాలా స్పష్టంగా చెప్పబడి వున్నది. అతనికి అతనే స్నేహితుడు మరియు శత్రువు.

రావణుడు మరియు దుర్యోధనుని జీవితాలు మనకు పాఠాలను నేర్పిస్తాయి, మనం అధర్మం చేస్తే, మనం ఎంతో బాధపడతాము, చివరకు మన పరివారముతో సహా సర్వ నాశనం అవుతాము అని. రామాయణం మరియు మహాభారతం నుండి మనకు తెలియ వచ్చింది ఏమిటంటే, అధర్మం చేసే వారి జీవితం ప్రారంభంలో సిరి సంపదలతో, పేరు ప్రఖ్యాతలతో మరియు కీర్తితో వర్ధిల్లుతున్నట్లుగా అనిపిస్తుంది కానీ చివరికి అన్నీ నాశనమవుతాయి. రామాయణం నుండి మనం నేర్చుకున్న పాఠం ఏమిటంటే "రావణుడి లాగా జీవించడం కాదు, రాముడిలా బ్రతుకు" అని.

అశోక వనంలో "సీతా మాతను" దర్శనం చేసుకున్న తరువాత, స్వామి హనుమాన్ రావణుడిని తన దర్బార్‌లో కలిశాడు. ఆ సమయంలో హనుమంతుడికి రావణాసురుడి యొక్క వ్యక్తిత్వం గురించి ఓ ఆలోచన మెదిలింది, నిస్సందేహముగా ఇతను త్రిలోకాలను పరిపాలించే శక్తిని మరియు సామర్థ్యాన్ని కలిగి యున్నాడు, కానీ అతను తన జీవితంలో చేసిన పెద్ద పాపం (అధర్మ) కారణంగా అతను ఆ యోగ్యతకు సరిపోడు. త్వరలోనే అతడికి చాలా కఠినమైన శిక్ష విధించబడుతుంది. అతను చేసిన అధర్మం ఏమిటంటే, “సీతమ్మను” ను వక్ర దృష్టితో చూడటం. మహిళలందరినీ మన తల్లులాగా చూడమని మన శాస్త్రాలు మనకు నిర్దేశిస్తున్నాయి. మన జీవితంలో కామానికి చోటు కల్పిస్తే, మన ఆధార్మిక పనుల వల్ల మనం చాలా నొప్పి, బాధలను, కష్టాలను పడాల్సి వస్తుంది.

అందుకే మనిషికి నిజమైన బంధువు ఎవరంటే, అతనికి అతనే. సంతోషకరమైన మరియు ప్రశాంతమైన జీవితం కోసం మనం ధర్మాన్ని పాటించాలి మరియు అధర్మానికి దూరంగా ఉండాలి.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

We submit our efforts at the Lotus feet of Jagadguru Śankarācārya His Holiness Mahāsannidhānam Śrī Śrī Srī Bhāratī Tīrtha Mahāswāmiji and Jagadguru Śankarācārya His Holiness Sannidhānam Śrī Śrī Śrī Vidhuśekhara Bhāratī Mahāswāmiji

## నమామి భగవత్పాదం

### CHAPTER 6 శ్రీ శంకరుడు తన అసమానమైన రచనలను ప్రారంభించినాడు




ఆ అనుభవాలతో పులకించిపోయిన శంకరుడు ముందున్న పనిపై మనసు పెట్టాడు. శంకరుడు కాశీ చుట్టుపక్కల ఉన్న అన్ని పవిత్ర జలాలలో స్నానమాచరించి, పరమశివుడు నిర్దేశించిన తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి మరింత అనుకూలంగా ఉందని భావించి బదరీకి తన ప్రయాణాన్ని ప్రారంభించినాడు . బదరీకి చేరుకుని అక్కడి ఋషులతో చర్చలు జరిపి, తన పన్నెండవ సంవత్సరంలో వ్యాసుని వేదాంత సూత్రాలపై అత్యంత లోతైన వ్యాఖ్యానం రాశాడు. వారణాసిలో ఉన్న సమయంలోనే వేదాంత శాస్త్రాలకు సంబంధించిన గీతా, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలపై ఆయన వ్యాఖ్యానాలు రాశారు. శంకరుని భాష్యాలు వైదిక బోధనలన్నింటినీ స్పృశిస్తూ స్పష్టమైన తర్కం మరియు స్పష్టమైన వివరణలతో పూరించబడినాయి. ఈ రచనల ద్వారా శంకరుడు ప్రతిపాదించిన వేదాంత సిద్ధాంతమును 'అద్వైతం' అంటారు. దీని తరువాత, శ్రీ శంకరులు వారణాసికి తిరిగి వచ్చారు. వారి వేదాంత వాఖ్యానములను తెలుసుకోవడానికి శిష్యులు అందరూ శ్రీ శంకరుల చుట్టూ గుమిగూడారు. సూర్య భగవానుడు కమలాలను వికసింపజేసినట్లు శ్రీ శంకరులు జ్ఞాన భాస్కరుడై తన శిష్యుల హృదయ కమలాలను వికసింపజేస్తున్నారు. వారి హృదయ తాపాలను నిశ్శేషంగా హరిస్తున్నారు. శ్రీ శంకరులు సనత్సు జాతీయుము, నృసింహతాపిన్యుపనిషత్, విష్ణు సహస్రనామములకు మరియు లలితా త్రిశతిలకు కూడా భాష్యములు రచించినారు.

కాశీలో శంకరుడు తన ప్రస్థానత్రయ భాష్యాలలో పేర్కొన్న విధంగా తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి తన తదుపరి పనిని ప్రారంభించినాడు. తన శిష్యుడైన సనందనకు లోతుగా వ్యాఖ్యానాలను బోధించాడు. సనందనకు చదువు పట్ల భక్తి, జీవితంలో కాఠిన్యం మరియు తత్వశాస్త్రంలోని సూక్ష్మాలను అర్థం చేసుకోగల సామర్థ్యం అతనికి శంకరునికి నచ్చాయి, అదే సమయంలో ఇతరులలో అసూయను పుట్టించాయి. శ్రీ శంకరులు సనందనుని గురుభక్తిని ప్రపంచానికి చాటిచెప్పాలని నిర్ణయించుకున్నారు, అందుకే ఒకరోజు గంగానది అవతలి ఒడ్డున ఉన్న సనందనుడిని వెంటనే రమ్మని పిలిచారు. సనందనుడు గంగా జలాలపై అడుగు పెట్టినాడు, గంగా నది సనందుని ప్రతి అడుగునకు ఒక పద్మముంచి నది దాటే వరకు పద్మాలపైనే నడిపించింది. కానీ సనందుని మనస్సంతా గురువాజ్ఞ యందే లగ్నమై ఉండటంచేత తను గంగా నది దాటిన విధం అతడేరుగడు. సనందున్ని చూసిన వారందరూ అమితమైన ఆశ్చర్యం పొందగా శ్రీ శంకరులు ఎదురేగి అతడ్ని కౌగిలించుకొన్నారు. అతని గురు భక్తికి మెచ్చి సనందునికి 'పద్మపాదుడనే' సార్ధక నామధేయం అనుగ్రహించినారు. తెలుగు అనువాదము : శ్రీ భాస్కరానంద నాథ

"Namami Bhagavatpadam' - **Source: Sri Madhaviya Shankara Digvijayam by Sri Vidyaranya**

Our mail ID : info@voiceofjagadguru.com

## ||आत्मबोध:|| ||ātmabodha:|| తెలుగు అనువాదము - శ్రీ భాస్కరానంద నాథ

व्यापृतेष्विन्द्रियेष्वात्मा व्यापारीवाविवेकिनाम् । दृश्यतेऽभ्रेषु धावत्सु धावन्निव यथा शशी ॥ १९ ॥

వ్యాపృతేష్వింద్రియేష్వాత్మా వ్యాపారీవావివేకినాం | దృశ్యతేఽభ్రేషు ధావత్సు ధావన్నివ యథా శశీ .. 19 ..



ఆకాశంలో మేఘాలు కదులుతున్నప్పుడు చంద్రుడు పరిగెత్తుతున్నట్లు కనిపిస్తాడు. అదేవిధంగా అవివేకికి ఇంద్రియ అవయవాల పనితీరు ద్వారా ఆత్మను గమనించినప్పుడు ఆత్మయే పనిచేయుచున్నట్లుగా భ్రమ పడుచున్నాడు.

आत्मचैतन्यमाश्रित्य देहेन्द्रियमनोधियः ।

स्वक्रियार्थेषु वर्तन्ते सूर्यलोकं यथा जनाः ॥ २० ॥

ఆత్మచైతన్యమాశ్రిత్య దేహేంద్రియమనోధియః .

స్వక్రియార్థేషు వర్తంతే సూర్యలోకం యథా జనాః

సూర్యుని యొక్క వెలుగు నందు జనులు తమ తమ పనులు చేసుకొన్నట్లు, ఆత్మ యొక్క చైతన్యము ను బట్టి, దేహేంద్రియములు, మనస్సు, బుద్ధి తమ తమ పనులయందు ప్రవర్తించు చున్నవి.

(Jagadguru Śankarācārya His Holiness Śrī Sannidhanam Śrī Srī Vidhushekhara Bhāratī Mahāswāmiji at Srinagar JUNE 6, 2023 With the blessings and directive of Sringeri Jagadguru Shankaracharya Sri Sri Bharati Tirtha Mahaswamiji, Jagadguru Sri Sri Vidhushekhara Bharati Mahaswamiji undertook a 3-day Vijaya Yatra to Jammu and Kashmir and performed the Pratishtha Kumbhabhishekam of Sri Sharada temple at Teetwal. Vijaya Yatra)

देहेन्द्रियगुणान्कर्माण्यमले सच्चिदात्मनि । अध्यस्यन्त्यविवेकेन गगने नीलतादिवत् ॥ २१॥

దేహేంద్రియగుణాన్కర్మాణ్యమలే సచ్చిదాత్మని | అధ్యస్యంత్యవివేకేన గగనే నీలతాదివత్ .. 21..

ఆకాశమునకు ఏ రంగు, గుణములు లేవు , అయిననూ అది నీల వర్ణముగా కనిపించినట్లు, విచక్షణ, ఆత్మ జ్ఞానము లేని అవివేకులకు దేహము, ఇంద్రియముల యొక్క గుణ కర్మలు ఆత్మ యందు కనిపించును.
(Will continue….)


Our mail ID : info@voiceofjagadguru.com

## Aparokṣānubhūtī అపరోక్షానుభూతి

आत्मा ज्ञानमयः पुण्यो देहो मांसमयोऽशुचिः ।
तयोरैक्यं प्रपश्यन्ति किमज्ञानमतः परम् ।। १९ ।।

ఆత్మా జ్ఞానమయః పుణ్యో దేహో మాంసమయోఽశుచిః .
తయోరైక్యం ప్రపశ్యంతి కిమజ్ఞానమతః పరం .. 19 ..

ఆత్మ చైతన్య స్వరూపం కలది, పరిశుద్ధమైనది. కానీ శరీరము అంతా మాంసమయమైనది, అపవిత్రమైనది. అటువంటి శరీరమును ఆత్మ యని భావించటంలో ఏమన్నా అర్ధమున్నదా ?



आत्मा प्रकाशक: स्वच्छो देहस्तामस उच्यते ।
तयोरैक्यं प्रपश्यन्ति किमज्ञानमतः परम् ।। २० ।।

ఆత్మా ప్రకాశక: స్వచ్ఛో దేహస్తామస ఉచ్యతే .
తయోరైక్యం ప్రపశ్యంతి కిమజ్ఞానమతః పరం .. 20 ..

ఆత్మ స్వయం ప్రకాశకుడు మరియు స్వచ్ఛమైనది. శరీరం చీకటి స్వభావం కలిగి, జడము లాగ ఉటుందని చెబుతారు. ఆత్మ లేని శరీరము కాష్టము అట్టి శరీరమును ఆత్మ యని భావించటంలో ఏమన్నా అర్ధమున్నదా ?

आत्मा नित्यो हि सद्रूपो देहोऽनित्यो ह्यसन्मयः ।
तयोरैक्यं प्रपश्यन्ति किमज्ञानमतः परम् ॥ २१॥

ఆత్మా నిత్యో హి సద్రూపో దేహోఽనిత్యో హ్యసన్మయః .
తయోరైక్యం ప్రపశ్యంతి కిమజ్ఞానమతః పరం .. 21..

నిత్య, సత్యమైన ఆత్మ శాశ్వతమైనది, నాశనము లేనిది. శరీరం తాత్కాలికమైనది, వృద్ధి క్షయములు గలవు, శరీరమునకు జరామరణములు తప్పవు. అందువలన దేహము, ఆత్మ ఒకటేయని భావించుట అజ్ఞానము తప్ప మరొకటి కాదు.

Decades ago in 1973, when Sri Swaroopananda Saraswati Mahaswamiji was coronated the Peetadhipathi of the Uttaramnaya Badri Jyotish Peetham, the Pattabhishekam ceremony was performed by Sringeri Jagadguru His Holiness 35th Jagadguru Shankaracharya Sri Abhinavavidya Tirtha Mahaswamiji

Our mail ID : info@voiceofjagadguru.com


# గురు అష్టకం స్తోత్రం

(ఆది శంకరాచార్యులు)

**శరీరం సురూపం తథా వా కళత్రం, యశశ్చారు చిత్రం ధనం మేరుతుల్యం |**

**గురోరంఘ్రి పద్మే మనశ్చేన లగ్నం, తతః కిమ్ తతః కిమ్, తతః కిమ్ తతః కిమ్ || 1**

చక్కని రూపం గల అందమైన భార్య ఉన్నప్పటికి, గొప్ప కీర్తి, మేరు పర్వతమంత డబ్బు ఉన్నప్పటికీ, గురువు పాదముల వద్ద నిలపలేని మనస్సు ఉండి, **ఏమి లాభం? ఏమి లాభం? ఏమి లాభం? ఏమి లాభం?**



**కళత్రం ధనం పుత్ర పౌత్రాధి సర్వం,**
**గృహం బాంధవా సర్వ మేతాధి జాతం, |**
**గురోరంఘ్రి పద్మే మనశ్చేన లగ్నం, తతః కిమ్ తతః కిమ్,**
**తతః కిమ్ తతః కిమ్ ||2**

భార్య, సంపద, పుత్రులు, మనుమలు, మంచి ఇల్లు, బంధువులు ఉండి గొప్ప కుటుంబములో పుట్టినప్పటికీ, గురువు పాదముల వద్ద నిలపలేని మనస్సు ఉండి **ఏమి లాభం? ఏమి లాభం? ఏమి లాభం? ఏమి లాభం?**

**షడంగాది వేదో ముఖే శాస్త్ర విద్య,**
**కవిత్వాది గద్యం, సుపదయం కరోతి |**
**గురోరంఘ్రి పద్మే మనశ్చేన లగ్నం, తతః కిమ్ తతః కిమ్,**
**తతః కిమ్ తతః కిమ్ ||3**

నీవు ఆరు అంగములలోను, నాలుగు వేదములలోను, పారంగతుడవైనా కావచ్చును, గద్య, పద్య రచనలో ప్రజ్ఞావంతుడైన గావచ్చును, గురువు పాదముల వద్ద **నిలపలేని మనస్సు ఉండి ఏమి లాభం? ఏమి లాభం? ఏమి లాభం? ఏమి లాభం?**

తెలుగు అనువాదము - శ్రీ భాస్కరానంద నాథ

Our mail ID : info@voiceofjagadguru.com

# గురు పాదుకా స్తోత్రం

(ఆది శంకరాచార్యులు)

గురు పాదుకా స్తోత్రం అనేది ఒక వ్యక్తి జీవితంలో గురువు యొక్క ప్రాముఖ్యతను స్తుతించే ఒక గొప్ప శ్లోకం మరియు ఈ స్తోత్రం పఠించడం ద్వారా గురువు యొక్క ఆశీర్వాదాలను పొందవచ్చు. ఇది గురువు యొక్క అనేక లక్షణాలను కీర్తిస్తుంది; తన మార్గదర్శకత్వంలో జీవించే వ్యక్తి జీవితం ఎలా మారుతుందో వివరిస్తుంది. గురు పాదుకా స్తోత్రం పఠించి, మీ గురువులను దర్శించండి, వారి అనుగ్రహాన్ని పొందండి మరియు మీ జీవితాన్ని మార్చుకోండి. ఇది శ్రీ జగద్గురు ఆది శంకరాచార్యులు రచించిన మహత్తరమైన ప్రార్థన. ఈ భక్తి ప్రార్థన గురువుల యొక్క పాదుకలకు అంకితం చేయబడింది, ఇది గురువులకు నమస్కారములు సమర్పించుకోవడం, ఈ సందర్భంలో గురువే భగవంతుడు అని అర్థం. అట్టి శ్రీ గురువుల పాదుకలను పట్టుకొని ప్రార్థన చేస్తాం రండి.

**అనంతసంసారసముద్రతార-నౌకాయితాభ్యాం గురుభక్తిదాభ్యామ్ |**

**వైరాగ్యసామ్రాజ్యదపూజనాభ్యాం నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్ || 1 ||**

అనంతమైన సంసార సాగరాన్ని దాటడానికి నాకు సహాయపడే నౌక అది, అది నా గురువు పట్ల భక్తి భావాన్ని కలిగిస్తుంది. దానిని ఆరాధించడం ద్వారా నేను వైరాగ్యం పొందుతాను. అటువంటి నా గురు పాదుకలకు నమస్కారములు, నమస్కారములు.

**కవిత్వవారాశినిశాకరాభ్యాం దౌర్భాగ్యదావాంబుదమాలికాభ్యామ్ |**

**దూరీకృతానమ్రవిపత్తితాభ్యాం నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్ || 2 ||**

పున్నమి చంద్రుడ్ని పోలిన జ్ఞాన సముద్రం ఏది, దురదృష్టాల మంటను ఆర్పే జలం ఏది? మరియు దేని ముందు సాష్టాంగ నమస్కారం చేస్తే వారి బాధలను తొలగిస్తుందో, అటువంటి నా గురు పాదుకలకు నమస్కారములు, నమస్కారములు.

**నతా యయోః శ్రీపతితాం సమీయుః కదాచిదప్యాశు దరిద్రవర్యాః |**

**మూకాశ్చ వాచస్పతితాం హి తాభ్యాం నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్ || 3 ||**

గురువులకు సాష్టాంగ నమస్కారాలు చేసేవారిని, వారు కడు పేదవారైనా వారికి గొప్ప సంపదను కలిగేలా చేస్తుంది, మూగ ప్రజలను కూడా గొప్ప వక్తలుగా చేస్తుంది. అట్టి నా గురు పాదుకలకు నమస్కారములు, నమస్కారములు.

తెలుగు అనువాదము - శ్రీ భాస్కరానంద నాథ


Our mail ID : info@voiceofjagadguru.com

## దివ్య పిల్లల కథలు - నచికేతుడు

పూర్వకాలంలో యాగాలు, హోమాలు చేసి, ఋషులు, బ్రాహ్మణులు, వేద పండితులు మరియు పేద ప్రజలకు దానధర్మాలు చేసే వైదిక సంప్రదాయం ఉండేది. వారు తమ దగ్గర వున్న ఉత్తమమైన సంపదను ఇతరులకు దానధర్మంగా ఇచ్చేవారు. ఇది వారి జీవితకాలంలో చాలా ముఖ్యమైన సందర్భంగా పరిగణించబడేది.




ఒకసారి వాజశ్రవుడు (ఉద్దాలకుడు) అనే ఒక ధనవంతుడు గొప్ప వైదిక యాగం చేయ సంకల్పించి, మరియు దానికి కావలసిన అన్ని ఏర్పాట్లను ప్రారంభించినాడు. ఆ తరువాత శాస్త్రములలో చెప్పిన విధంగా, వేదపండితులు, ఋషులు, తదితరులను దైవోత్సవానికి ఆహ్వానించారు. యాగ శాలను అందంగా అలంకరించారు. దేవతలే దిగి వచ్చినారా అన్నట్లుగా వున్నది. వేద ఘోషతో మంత్రములతో మారుమ్రోగుచున్నది యాగ శాల.

వాజశ్రవుడికి ఏడేళ్ల వయసున్న నచికేతుడు అనే కుమారుడు ఉన్నాడు. తండ్రి ఏం చేస్తున్నాడో జాగ్రత్తగా గమనిస్తూ మండపంలో జరిగే భక్తి కార్యక్రమాల పట్ల ఎంతో ఆసక్తి కనబరిచేవాడు. తన తండ్రి ఏ ప్రయోజనం కోసం ఇలాంటి పనులు చేస్తున్నాడో తెలుసుకోవాలని ఆత్రుతగా ఉండేది అతనికి. యజ్ఞం ముగిశాక వాజశ్రవుడు ఋషులకు, పండితులకు ఆవులను దానం చేయడం ప్రారంభించారు. తండ్రి చర్యకు నచికేతుడు ఆశ్చర్యపోయాడు.

వాజశ్రవుడు ఎందుకూ పనికిరాని గోవులను, గొడ్డులను, ముసలి ఆవులను దానం చేయసాగాడు. ఇది గ్రహించిన అతని కుమారుడు నచికేతుడు తన తండ్రిని పాపం నుండి విముక్తున్ని చేయదలచి "నాన్నా! నేనూ కూడా నీకు గల సంపదనే కదా. మరి నన్ను కూడా దానం చెయ్యి" అన్నాడు. దీన్ని ఒక బాల్యచేష్టగా తీసుకుని వాజశ్రవుడు విసిగించవద్దని అన్నాడు. కాని కొడుకు యొక్క పోరు పడలేక విసుగుతో "నిన్ను యముడికి ఇస్తాను" అని అన్నాడు. (ఇప్పుడు కూడా మనం ఏమైనా కోపం వస్తే "చావు పో" అని అంటాము కదా అలా అన్న మాట).

కాని యజ్ఞం తర్వాత వాజశ్రవుడు తను కొడుకుతో అన్న మాటలు గుర్తొచ్చి చాలా భాధపడ్డాడు. కానీ నిజానికి అతన్ని మృత్యు దేవతకు (యమ ధర్మరాజుకు) ఇవ్వడానికి సిద్ధంగా లేడు. అలాంటి దేవుడికి తమ పిల్లలను ఇవ్వాలని ఏ తండ్రి కోరుకోడు. అదే సమయంలో తండ్రి మాటను నెరవేర్చడం తన కర్తవ్యం గా భావించాడు నచికేతుడు.

అప్పుడు నచికేతుడు తండ్రితో "నాన్నా! ఈ ప్రపంచంలో మాట నిలుపుకోకపోవడం వలన అసత్య దోషం వస్తుంది. మీరు ఏమీ భాధపడకుండా నన్ను యముడి వద్దకు పంపండి." అని యముని వద్దకు వెళ్ళాడు. నచికేతుడు. యముడి వద్దకు వెళితే యాగంలో తండ్రి చేసిన కర్మ శుద్ధి చెంది తండ్రికి అత్యంత ప్రీతిపాత్రుడు అవుతాడు అని నిర్ణయించుకుని నచికేతుడు యముడి వద్దకు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

వాజశ్రవుడు తన కొడుకును గట్టిగా మందలిస్తూ, నీ మీద కోపంతో అలా అన్నాను. బాధతో చెప్పిన ఆ మాటలను ఎవరూ పాటించాల్సిన అవసరం లేదు. కాబట్టి నా ప్రియమైన బిడ్డా దయచేసి నా మాటలను తీవ్రంగా తీసుకుని నన్ను బాధ పెట్టకు. 'తిరిగి, నా దగ్గరకు రా...అని అన్నాడు.

కానీ నచికేతుడు చేతులు జోడించి అన్నాడు, అయ్యో! నాన్న! మన పూర్వీకులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ మాటలను తప్పలేదని మీరే నాకు చెప్పారు. మాటల్ని నిలబెట్టుకునే పవిత్ర సంప్రదాయం నుంచి మీరు దూరం కావడం నాకూ ఇష్టం లేదు. ఓ నా ప్రియమైన తండ్రీ మీరు నాతో చెప్పిన మాటలను ధిక్కరించడం నాకు ఇష్టం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీ మాటలు నాకు ఆజ్ఞే. దయచేసి దాని ప్రకారం నన్ను అనుమతించండి.




సత్యమే స్వర్గానికి ప్రవేశ ద్వారం. సత్యం తప్ప ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. సత్యాన్ని అనుసరించే గొప్ప అవకాశం ఈ మానవ జన్మకు మాత్రమే ఉంది. ఈ భూమ్మీద ఉన్న ఇతర జీవరాశులన్నీ పక్షులు, జంతువులు, మొక్కల్లాగే ఉంటాయి, సత్యమార్గంలో జీవించని వారికి కేవలం పుట్టడం, చావడం మాత్రమే ఉంటుంది. చావుకు భయపడను. ఈ క్షణంలో మీరు తమ మాటలను నిలబెట్టుకుంటూ అత్యంత అరుదైన మానవ జన్మను గడిపిన, వారి జీవితంలో సత్యం యొక్క చర్యను గౌరవించిన మన పూర్వీకుల గురించి ఆలోచించాలి. స్వార్థపరులు మాత్రమే వారి మాటలను ఉల్లంఘించి అప్రియమైన పనులు చేస్తారని మీకు బాగా తెలుసు. ఎంతో పవిత్రమైన యజ్ఞయాగం సందర్భంగా నన్ను యమ ధర్మరాజు కి దానంగా ఇచ్చారు. కాబట్టి నా ప్రియమైన తండ్రి మీరు మీ మాటలను ఉల్లంఘించి స్వార్థపరుడిలా ప్రవర్తించకండి.

తన కుమారుడు నచికేతుడి నిర్ణయంతో వాజశ్రవుడు సంతృప్తి చెందనప్పటికీ, విధిలేక అతని నిర్ణయాన్ని అంగీకరించడం తప్ప అతనికి వేరే మార్గం తోచడం లేదు. ఇప్పుడు అతని తండ్రి తన కుమారుడికి మృత్యు దేవతయైన యముడి వద్దకు వెళ్ళడానికి అనుమతి ఇచ్చాడు. తన తండ్రి చెప్పిన పని చేస్తున్నానని, ఎలాంటి అడ్డంకులు లేకుండా దాన్ని నెరవేర్చాలని నచికేతుడు మనసులో ఎంతో ఆనందంతో ఉన్నాడు. ఇతరులకు ప్రవేశ అధికారము లేని దుర్భేద్యమైన యమలోకానికి నచికేతుడు చేరుకోగా, యమ ధర్మరాజు తన లోకం లో లేరని బయటకు వచ్చాడని తెలుసుకున్నాడు. తనను అనుమతించడానికి అక్కడ ఎవరూ లేరని, ఏడేళ్ల బాలుడు నచికేతుడు ఆహారం మరియు నిద్ర లేకుండా యమ ధర్మరాజును కలవడానికి మొత్తం మూడు పగళ్ళు మరియు మూడు రాత్రులు యమ లోకం లోని ప్రవేశ ద్వారం వద్దనే వేచి ఉన్నాడు. (ఇంకా వుంది) తెలుగు అనువాదము : శ్రీ భాస్కరానంద నాథ Source: MARCH, 2016

# Dialogues with The Guru

## "గురువులతో సంభాషణలు"



Sri Chandrasekhar Bharati Maha Swamigal (1892-1954), 34th Pontiff (1912-1954) of the Sri Sharada Peetam, Sringeri. Compiled by Sri R. Krishnaswamy Iyer
తెలుగు అనువాదము : శ్రీ భాస్కరానంద నాథ

"గురువులతో సంభాషణలు" అను పుస్తకం లోని ఈ భాగములు, వ్యక్తిని మరియు సమాజాన్ని ఇబ్బంది పెట్టే అనేక ప్రశ్నలకు సమాధానాలను మనకు అందిస్తాయి. శ్రీ ఆచార్యుల వారు, సాధారణ ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నప్పుడు, సనాతన ధర్మం యొక్క నిజమైన అర్థాన్ని ప్రతిబింబించేలా ప్రేరేపిస్తారు మరియు దాని యొక్క సూత్రాలను ఆధునిక జీవితానికి ఎలా అన్వయించుకోవాలో కూడా తెలుపుతారు. పరమ పూజ్య జగద్గురువులు శ్రీ శ్రీ చంద్రశేఖర భారతీ మహాస్వామి వారి తో చేసిన “చర్చల అనువాదం” భాగాలను శ్రీ ఆర్. కృష్ణస్వామి అయ్యర్ గారు సంకలనం చేసినారు.

### అద్వైతం

వేదాంత సాహిత్యంలో కొంత ప్రవేశము, పరిచయం కలిగి ఉన్న మిస్టర్ ఆర్., అను అనుభవం గల ఓ పెద్దమనిషి ఒకసారి జగద్గురువులను సంప్రదించి ఇలా అన్నారు:

నేను అద్వైత తత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో ప్రయత్నించాను, కాని అనేక సందేహాలు మరియు ఇబ్బందులు ఒకదాని తరువాత ఒకటి పెరుగుతూనే వచ్చినాయి, అలా శ్రీ గురు చరణులు శ్రీ శ్రీ చంద్రశేఖర భారతీ మహాస్వామి వారి తో సంభాషణలు మొదలు అయినాయి, నా అంతట నేను పరిష్కరించుకోవడం సాధ్యం

కాలేదు మరియు నేను కలిసిన పండితుల సహాయంతోనూ పరిష్కరించడం సాధ్యం కాలేదు. అద్వైత-వేదాంతంలోకి నన్ను ప్రవేశపెట్టడానికి పూజ్య గురుదేవుళ్ళు మీరు అంగీకరిస్తే నేను చాలా అదృష్టవంతుడ్ని.

**పూజ్య గురుదేవుళ్లు** : నిజంగా నేను చేయగలిగితే, నాకు చాలా ఆనందంగా ఉంటుంది. కానీ ఇది నా సామర్థ్యానికి మించినది.

**భక్తుడు:** పూజ్యులు మీరు అంత తీవ్రంగా పట్టించుకోవడం లేదని మాత్రం నేను ఖచ్చితంగా చెప్పగలను. జగద్గురువులు మీరే అద్వైతమును బోధించడానికి అసమర్థతను ప్రకటిస్తే, ఇక ప్రపంచంలో మరెవరో దానిని బోధిస్తారని నేను అనుకోవడం లేదు. అంటే ఎవ్వరూ చెప్పలేరు.

**HH:** మనం ఏమి చేయగలం? ఇది దాని యొక్క స్వభావం. ఉపనిషత్తు శాస్త్రము స్వయంగా ప్రకటించింది "తెలిసిందని చెప్పుకునేవాడికి తెలియదు" అని. అద్వైతం నేర్చుకోవలసిన విషయం కాదు, కనుక ఇది బోధించవలసిన విషయం కాదు. ఇది తప్పనిసరిగా స్వయంగా అనుభవపూర్వకముగా ఎవరికి వారు గ్రహించవలసిన విషయం. అందువల్ల నేను మీకు నేర్పించడం లేదు. అయితే, మీ వేదాంతం అధ్యయన పరిశీలనా సమయంలో మీరు ఏదైనా భాగాన్ని వచనంలో లేదా వ్యాఖ్యానంలో గాని వివరించాలని కోరుకుంటూ వుంటే, దానిని వివరించడానికి నేను ఖచ్చితంగా ప్రయత్నిస్తాను. పదాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి మాత్రమే నేను మీకు సహాయం చేయగలను, పదాలతో కూడిన వాక్యాల, లేదా వాక్యాల ద్వారా తెలియజేసే ఆలోచనలను తెలుపగలను.

కానీ అద్వైతం అంటే ఏమిటో మీకు ఖచ్చితమైన భావాన్ని, ఆలోచనను చెప్పడం అసాధ్యం, ఎందుకంటే ఇది వాక్యములకు సంబంధించినది కాదు లేదా మానసిక భావన కాదు. మరోవైపు, వీటన్నిటిని మించిన స్వచ్ఛమైన అనుభవం ఇది. ఉదాహరణకు తీపు అంటే ఏమిటో నాకు తెలియదని కాసేపు అనుకుందాం. నాకు తీపు యొక్క ఆలోచనను, భావనను, రుచిని తెలియజేయడానికి తగినంత వ్యక్తీకరణ పదాలతో తీపిని వర్ణించగలరా మీరు? నాకా రుచిని మీరు మాటలతో చెప్పగలరా?......**D:** అది ఖచ్చితంగా అసాధ్యం.

**HH:** నేను నా నాలుకపై కొన్ని మధుర పదార్థాలను ఉంచినప్పుడు మాత్రమే తీపి యొక్క మధురానుభూతిని, తియ్యదనాన్ని నేను అనుభవించగలను, తెలుసుకోగలను. దాన్ని మాటల్లో వివరించడం లేదా మరొక వ్యక్తి నుండి నేర్చుకోవడం అన్నది అసాధ్యం. దీనిని ప్రత్యక్ష అనుభవం ద్వారా మాత్రమే గ్రహించగలము. మనకు బాగా తెలిసిన ఒక పదార్ధం, ఉదాహరణకు ఓ మిఠాయి పదార్ధం వలే అన్ని వ్యక్తీకరణలను, భావాలను మించినదై ఉంటే, ఇక అద్వైతం యొక్క సత్యం ఎంత గొప్పదో ఆలోచించండి, అది అత్యంత మాధుర్యం గలది.

ఇప్పుడే ఇక్కడకు వచ్చి వెళ్ళిన ఒక పెద్దమనిషి ఈ సందర్భములో గుర్తుకు వస్తున్నాడు. అతను బ్రాహ్మణుడు కాని అతని వ్యవహారమంతా 'ఆధునిక పోకడలలో' ఉంటుంది. కాబట్టి అతను పేరుకు మాత్రమే బ్రాహ్మణుడు, మరియు పరిస్థితులకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి మనం, అతను ఈ ప్రజా జీవితంలో ఒక ప్రముఖ స్థానాన్ని పొందివున్నాడు. ఇక్కడకు రావడం ఇదే ప్రధమం, ఇదే మొదటి సందర్శన. అతను ఈ నది యొక్క స్పష్టమైన నీరు, చుట్టూ ఉన్న సహజ ప్రకృతి దృశ్యాలు, ప్రశాంతమైన ఈ వాతావరణం మరియు ఇతర విషయములతో చాలా మంత్రముగ్ధుడైనట్లు అనిపించింది. అతను నా వద్దకు వచ్చినప్పుడు, అతను అనుభవించిన ఆ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ 'అబ్బ ఏమిటీ ఈ బ్రహ్మానందం' అని అన్నాడు. అవును, అతను నిజమే పలికినాడు. వాస్తవానికి ఇది బ్రహ్మానందమే, బ్రహ్మ యొక్క ఆనందం, పరమ సత్యం. (ఇంకా వుంది)

సర్వం శ్రీ గురు చరణారవిందార్పణమస్తు. గురు సేవలో .... 03-08-2020

Our mail ID : info@voiceofjagadguru.com

## శృంగేరి లేఖలు (Letters of Sringeri)

**Source: "Glimpses of Grace"**

జగద్గురువులు శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి వారి ఆశీస్సులతో ......

### విషపూరితమైన కాలు తొలగించినారా ?



ఒక మహిళా భక్తురాలు కాలు వ్యాధితో బాధపడుతున్నారు, అది ఆమె జీవితానికి ప్రమాదకరమని వైద్యులు భావించారు. పెద్ద శస్త్రచికిత్స (Operation) చేయించుకోవాలని లేదంటే ఆమె కాలు విషపూరితమై విచ్ఛిన్నం అవుతుంది అని ఆమె వైద్యులు ఆమెకు సలహా ఇచ్చారు.

సహజంగానే ఇది ఆ మహిళను చింతించలేదు. ఆమె శారదా దేవిని ప్రార్థిస్తూ, "అమ్మా మీరు నా హృదయంలో నివసిస్తున్నందున, కాలు తొలగించడం నాకు ఇష్టం లేదు. నా అవయవాలలో ఒకదాన్ని తొలగించడం అంటే మీ అవయవాలలో ఒకదాన్ని తీసివేస్తున్నట్లుగా నేను భావిస్తున్నాను. నేను మిమ్మల్ని" అంగవిహీనం"గా చేయాలనుకోవడం లేదు గాని మీరు ఈ సమస్యను అధిగమించడానికి నాకు సహాయం చెయ్యండి లేదా నేను ఇప్పుడు ఉన్నట్లుగా మీరు నన్ను తీసుకెళ్లండి. " అని శారదా దేవిని ప్రార్థించిన తరువాత ఆమెకు పూర్తిగా ఆందోళన లేకుండా పోయినది, మనశ్శాంతి లభించినది.

అనంతరం ఆమెను ఆసుపత్రిలో చేర్పించినారు. శస్త్రచికిత్స జరిగే రోజున, చీఫ్ సర్జన్ ఆమె వద్దకు వచ్చి ఆమె గురువు గారి పేరు అడిగారు. ఆ మహిళ యొక్క గురువు గారు మన జ్యేష్ఠ మహా సన్నిధానం, శ్రీ శ్రీ అభినవ విద్యాతీర్థ

మహాస్వామి వారు. అయితే, ఆ మహిళ "ఆది శంకరాచార్య" అని బదులిచ్చింది. డాక్టరు తన గురువు గారి పేరును గుర్తిస్తారు అని అనుకో లేదు ఎందుకంటే అతను దేశం యొక్క వేరే ప్రాంతానికి చెందినవాడు.

"నిన్న రాత్రి, నేను కలగన్నాను, అందులో కాషాయ రంగు దుస్తులలో అలంకరించబడి, రుద్రాక్ష మాల ధరించిన ఓ స్వామీజీ, మీ కాలును తొలిగించ వద్దని, అది నయం అవుతుందని నాకు చెప్పారు, ఈ రోజు ఉదయం కూడా, నేను ప్రార్థనలు చేసేటప్పుడు, నాకు అదే సూచన అందినది, దైవ నిర్ణయం ప్రకారం నేను మీ కాలును తొలిగించడం లేదు" అని డాక్టర్ చెప్పాడు. డాక్టర్ ఆ మహిళ యొక్క కాలును మరలా ఎక్స్-రే తీసి పరీక్షించి శస్త్రచికిత్సకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నాడు. కొద్ది రోజులలోనే ఆమె కాలు పూర్తిగా నయం అయి, స్వాధీనం లోకి వచ్చినది. గురువుల దయ వుంటే ఎంతటి రోగమైన ఇట్టే తొలగిపోతుంది. (తెలుగు అనువాదము : శ్రీ భాస్కరానంద నాథ)

శ్రీ గురో పాహిమాం...పరమ దయాళో పాహిమాం...శృంగేరి జగద్గురో పాహిమాం...శ్రీ భారతీతీర్థ పాహిమాం.. శ్రీ విధుశేఖర భారతీ పాహిమాం....దాసోహం శృంగగిరి నాథ. సర్వం శ్రీ గురు చరణారవిందార్పణమస్తు.

| Editorial Board | | |
|---|---|---|
| Sri P A Murali | Hon' Advisor | Administrator & CEO, Sri Sringeri Mutt & It's Properties, Sringeri |
| Sri S N Krishnamurthy | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| Sri Tangirala Shiva Kumara Sharma | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| B Srimathi Veeramani | Chief Editor | Tirunelveli |
| K M Kasiviswanathan | Hon' Editor | Tirunelveli |
| Sri Bhaskarananda Natha | Writer/Translator | Nellore |

Our mail ID : info@voiceofjagadguru.com